ప్రజా విశ్వంభర
V3 NEWS

కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీకి తొత్తుగా మారింది

- మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా సర్ ప్రక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుంది
- సర్ లో దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, నా ఓటు గల్లంతు అయిన ఆశ్చర్యం లేదు
- అధికారం శాశ్వతం అనుకుంటే వారు మూర్ఖులే
- దేవుళ్ళకు ఎవరు వ్యతిరేకం కాదు..కానీ దేవుడి పేరు చెప్పనిదే బీజేపీ వాళ్లకు ఓట్లు పడవు
- జగ్గారెడ్డి ఏడాదిలో అనేకసార్లు పూజలు చేస్తారు
- కానీ దేవుళ్ళ పేరుతో ఓట్లు అడిగే వాళ్ళం మేము కాదు
- బీజేపీ పై నిప్పులు చెరిగిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

విశ్వంభర, సంగారెడ్డి : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. అలాంటి దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యంగ్యంగా అన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ ఓనమాలు నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ దేశంలో అతికొద్దిమంది నిజాయితీపరుల్లో మీనాక్షి నటరాజన్ ఒకరని పేర్కొన్నారు. ఆ కారణంతోనే ఆమె రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించారని తెలిపారు. బీజేపీ వాళ్లకి కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల్లా ఉండాలని బీజేపీ నేతలు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మీ కంటే పెద్ద చక్రవర్తులే నేలమట్టం అయ్యారు.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఎంత..? అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం అనుకుంటే.. వారు మూర్ఖులే అవుతారన్నారు. దేవుళ్లకు ఎవరు వ్యతిరేకం కాదని.. కానీ దేవుడి పేరు చెప్పనిదే బీజేపీ వాళ్లకు ఓట్లు పడవన్నారు. ఏడాదిలో చాలాసార్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూజలు నిర్వహిస్తారని.. కానీ దేవుళ్ల పేరుతో తాము ఓట్లు అడగమన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించి.. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారంటూ కేంద్రంపై టీపీసీసీ చీఫ్ నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చీఫ్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.

విద్యా విప్లవానికి ఆరుట్లతో శ్రీకారం

- గేమ్‌చేంజర్ గా టీపీఎస్
- అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వ విద్య
- నాణ్యమైన విద్య, రవాణా, పోషకాహారం అందజేత
- నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఒకే క్యాంపస్
- నేడు ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించనున్న సీఎం
- విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేయనున్న రేవంత్ రెడ్డి

విశ్వంభర, హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు కొత్త దిశను చూపించే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా విద్యా సంస్కరణలు చేపట్టిన ప్రజా ప్రభుత్వం తొలి అడుగుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌కు నాంది పలికింది. తన డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఆరుట్లలో బుధవారం ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా అత్యాధునిక వసతులతో రూపొందిన టీపీఎస్ తెలంగాణ విద్యా రంగంలో నూతన విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టనుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం 9:30 గంటలకు ఆరుట్లకు చేరుకుని తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం పాఠశాలలోని డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, డైనింగ్ హాల్, క్రీడా మైదానాలను పరిశీలించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తారు. అనంతరం అక్కడే భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్..

రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి విద్యారంగ బలోపేతానికి సూచనలు తీసుకున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి, సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్ రావు,, డాక్టర్ చారకొండ వెంకటేష్, జోష్నా శివారెడ్డి ల ప్రత్యేక పర్యవేక్షణలో ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రూపుదిద్దుకుంది.ఇక్కడ నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందుతుంది. నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యమిస్తున్నారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించనున్నారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన జరగనుంది. ఆధునిక బోధనా పద్ధతులు, సాంకేతిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా తెలంగాణ విద్యకు రోల్ మోడల్‌గా తెలంగాణ పబ్లిక్ స్కూల్ రూపుదిద్దుకుంది.తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రభుత్వం నాలుగు పాఠశాలలను ఎంపిక చేసింది. మొదటి విడతలో రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్ల, మంచాల పాఠశాలలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలను ఎంపిక చేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రజా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. రాష్ట్రంలో దశలవారీగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఆరుట్ల టీపీఎస్ అదుర్స్..

కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ వాతావరణం కనిపిస్తోంది. ఆధునిక వసతులు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, విద్యార్థులకు విశాలమైన ప్లేగ్రౌండ్స్, ల్యాబ్స్, గాలివెలుతురు పుష్కలంగా ఉండే తరగతి గదులు, లైబ్రరీ, జిమ్, డైనింగ్ హాల్స్‌తో పాటు క్రికెట్, ఫుట్ బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, క్యారమ్స్ వంటి ప్రతి క్రీడకు సంబంధించిన మైదానాలు, వసతులు ఏర్పాటు చేశారు. ఆయా క్రీడలకు ప్రత్యేక శిక్షకులను కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ఆరుట్ల చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాలకు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం అయిదు స్కూల్ బస్సులను ఏర్పాటు చేసింది. దీంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న పిల్లలను సైతం టీపీఎస్‌లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు.ప్రస్తుతం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో మొత్తం 1,814 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రీప్రైమరీ విభాగంలో 150 మంది, ప్రైమరీ స్కూల్‌లో 600 మంది, హైస్కూల్ రెండు బ్లాకుల్లో కలిపి 800 మంది, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 160 మంది, రెండో సంవత్సరంలో 104 మంది విద్యార్థులు ఉన్నారు.తల్లిదండ్రుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోలేక 'నో అడ్మిషన్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి టీపీఎస్‌లో నెలకొంది. ప్రభుత్వ విద్యను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఆరుట్లలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్ర విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది.

నాబార్డు జిల్లా కార్యాలయం ప్రారంభం

విశ్వంభర,సూర్యాపేట: సూర్యాపేట జిల్లాలో వ్యవసాయ మరియు గ్రామీణ అభివృద్ధి మరింత వేగవంతం చేసేందుకు నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కార్యాలయాన్ని నాబార్డ్ తెలంగాణ సిజిఎం ఉదయ భాస్కర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గతలో నల్గొండ క్లస్టర్ కింద ఉన్న సూర్యాపేటను ఇప్పుడు ప్రత్యేక జిల్లాగా మార్చి నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందుకుగాను సూర్యాపేట జిల్లా నాబార్డ్ ప్రతినిధిగా డి రవీందర్ నాయక్ ను నియమించినట్టు చెప్పారు. జిల్లాలోని రైతులు మహిళలు సంఘాలు అభ్యున్నతికి నాబార్డు నిరంతరం కృషి చేస్తుందన్నారు. సూర్యాపేటలో ఫిషరీస్ ,ఎనిమల్ హస్బెండరీ, డైరీ రంగాలలో మూడు రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నాము అని తెలిపారు. మహిళా సంఘాల జీవనోపాదుల కల్పనకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు . కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా వేరుశనగ సాగు వంటి వివిధ వ్యవసాయ రంగంపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. వాతావరణ పరిస్థితుల్లో అనుగుణంగా సాగు పద్ధతులు ప్రోత్సహిస్తూ డిసిసిబి తెలంగాణ గ్రామీణ బ్యాంకు సహకారంతో రైతులకు ఎఫ్పిఓల కు సకాలంలో కేసీసీ, గృహ, వ్యవసాయ రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని సి.జి.ఎమ్ తెలియజేశారు. అనంతరం మున్యా నాయక్ తండా లో ఎల్ఈడీపీ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ ప్రతినిధులు బి. ఉదయ్ భాస్కర్, బి. స్వాతి, డి. రవీందర్ నాయక్, ఎల్. డి.ఎం నాగప్రసాద్ డిసిసిబి సిఈఓ శంకర్రావు, టి.జి.బి చీఫ్ మేనేజర్ అజయ్, కె వి కె సీనియర్ సైంటిస్ట్ నరేష్, ఎన్జీవో ప్రతినిధులు వి రమేష్ ఇన్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే ప్రజల సమక్షంలోనే మంత్రి పదవికి రాజీనామా చేస్తా

మాజీ మంత్రి హరీష్ రావ్ కు సవాలు విసిరిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

విశ్వంభర, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల కొనుగోళ్లకు సంబంధించిన టెండర్ల విషయంలో మాజీ మంత్రి హరీష్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అబద్ధాల ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఒకే అంశంపై బీఆర్ఎస్ నాయకులు మూడు రకాల అంకెలు చెబుతున్నారని విమర్శించారు. హరీష్‌రావు రూ.2,000 కోట్ల కుంభకోణమని చెబుతుండగా, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రూ.3,000 కోట్ల వరకు కుంభకోణం జరిగిందని ఆరోపిస్తున్నారని, మరోవైపు వారి అనుబంధ మీడియా సంస్థలు రూ.200 కోట్ల వ్యవహారమని ప్రచారం చేస్తున్నాయని అన్నారు.అసలు నిజమైన అంకె ఏది..? రూ.200 కోట్లా..? రూ.2,000 కోట్లా..? రూ.3,000 కోట్లా..? మీకే క్లారిటీ లేకపోతే ప్రజలు ఎలా నమ్మాలి?" అని ప్రశ్నించారు. హరీష్ రావు చెప్పింది నిజమని ఆధారాలతో నిరూపిస్తే ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చి ప్రజల సమక్షంలోనే మంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని సవాల్ విసిరారు*.టెండర్ల గురించి తనకు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలియదని ప్రచారం చేయడం పూర్తిగా అబద్ధమని మంత్రి స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ముగ్గురు మంత్రులతో, అధికారులతో అలాగే ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి సమీక్ష నిర్వహించిన అనంతరమే కొనుగోలు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఇది మంత్రులకు తెలియకుండా నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం కాదు. ప్రతి నిర్ణయం పారదర్శకంగా జరుగుతోంది" అని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, న్యాయస్థానం ఈ విధానాన్ని సమర్థించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గుర్తు చేశారు.టెండర్లన్నీ ఈప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా, సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించామని వెల్లడించారు."వేల కోట్ల కుంభకోణం జరిగిందని చెబుతున్నారు. ఒక్క ఫైల్ చూపించండి. ఒక్క చెల్లింపు వివరాన్ని చూపించండి. ఒక్క ఆధారాన్ని ప్రజల ముందుంచండి." అని మంత్రి అడ్లూరి డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రజలకు కావాల్సింది ప్రచార సంఖ్యలు కాదు. స్పష్టమైన ఆధారాలు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.అబద్ధాలను పదిసార్లు చెప్పి నిజాలుగా మార్చే రాజకీయాలు మాకు తెలియవు. దోచుకోవడం, దాచుకోవడం మాకు తెలియదు. పారదర్శక పాలన మాత్రమే తెలుసు."అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

హుస్నాబాద్ కరెంటు పోల్ టెండర్‌పై విచారణ జరపాలి

విశ్వంభర, హుస్నాబాద్ : హుస్నాబాద్ మున్సిపాలిటీ నిధులతో చేపడుతున్న కరెంటు పోల్‌లు, వైరింగ్, కడసరాలు, ఎర్త్ వైర్ల ఏర్పాటు పనులపై సమగ్ర విచారణ జరపాలని బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు.పట్టణంలోని 20 వార్డుల్లో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన విద్యుత్ పనులు ఇప్పటివరకు ఎంత మేర పూర్తయ్యాయో ప్రజలకు వెల్లడించాలని కోరారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా పూర్తి చేయడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా వద్ద రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా అక్కడ ఉన్న మూడు పోల్‌ల తొలగింపు రాజకీయ కారణాలతో నిలిచిపోయిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ నిధులతో కొనుగోలు చేసిన పోల్‌లు, అల్యూమినియం లేదా కాపర్ వైర్లు, కడసరాలు ఇతర గ్రామాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. ఈ అంశాలపై హుస్నాబాద్ విద్యుత్ శాఖ ఏఈ, మున్సిపల్ ఏఈలు వెంటనే విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వెలుపుల రాజు, ఎలగందుల శంకర్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి
మండల స్థాయి రైతు వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్
అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యం
మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్
ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

విశ్వంభర, మహబూబాబాద్ : జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి అభివృద్ధి, వానాకాలం సీజన్, సంక్షేమ పథకాల అమలు, జిల్లా ప్రధాన ఆసుపత్రి అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య లు హాజరయ్యారు.వానాకాల వ్యవసాయ సన్నాహక ,అభివృద్ధి పథకాలు తదితరాంశాలు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ వానాకాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల స్టాక్, సరఫరా, నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.చెరువులు, కాలువలు, మిషన్ కాకతీయ పనుల పురోగతి. చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు వాతావరణ సమాచారం, సాగు సలహాలు ఎస్ఎంఎస్/వాట్సాప్ ద్వారా పంపే ఏర్పాట్లు చేయాలని అన్నారు.మండల స్థాయి రైతు వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించి అధిక లాభాలు కలిగిన పంటలు పండించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు.జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి పనులు, కొత్త మెడికల్ కాలేజీ నిర్మాణం, ఓపి విభాగాల పనితీరుపై వైద్య ఆరోగ్య శాఖ పై వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రుల్లో కొత్త వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల పనుల పురోగతి పరిశీలన. నాణ్యతతో త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. మెడికల్ కాలేజీ నిర్మాణంలో ఉన్న కొత్త మెడికల్ కాలేజీ భవనాలు, హాస్టళ్లు, ల్యాబ్‌ల పనులను వచ్చే అకడమిక్ ఇయర్‌లోగా పనులు పూర్తి చేయాలని అన్నారు.ఔట్ పేషెంట్ విభాగాల్లో రోగులకు వేచి ఉండే సమయం తగ్గించడం, డాక్టర్ల హాజరు, మందుల స్టాక్‌పై చర్చ. 24/7 ఫార్మసీలు అందుబాటులో ఉంచాలని సూచన.పరికరాలు, సిబ్బంది, డయాలసిస్ యంత్రాల ఏర్పాటు, ఖాళీగా ఉన్న డాక్టర్/నర్స్ పోస్టుల భర్తీపై చర్యలు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత, బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ఇందిరమ్మ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుపరుస్తుందని అందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం, కొత్త రేషన్ కార్డుల మంజూరు, రైతు బీమా, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, 6 గ్యారంటీల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు, జిల్లాలో మంజూరు అయిన సాంకేతిక కారణాలతో ఆగిపోయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులు ప్రస్తుతం ఉన్న జిల్లా ఆసుపత్రిలో వైద్యం నిమిత్తం వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన వేగవంతమైన సేవలు అందించాలని, ఆస్పత్రిలో బీపీ మిషిన్లు అందుబాటులో ఉంచాలని, టిబి డయాలసిస్, గైనకాలజిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు , వివో బిల్డింగ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, ప్రభుత్వ వైద్య విద్యార్థినిల కోసం దాతల సహకారంతో రవాణా సౌకర్యం కల్పించాలని, అందుకోసం రెడ్ క్రాస్ సొసైటీ వాళ్ళు కృషి చేయాలని అన్నారు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల పరిధిలో పెండింగ్లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు,ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో బయ్యారం మండలం నామాలపాడు గ్రామం పైలెట్ ప్రాజెక్టులో ఉందని అక్కడ ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ను కోరారు,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ "ప్రజారోగ్యం ప్రభుత్వ ప్రాధాన్యత. ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మర్యాదపూర్వకంగా, వేగంగా వైద్యం అందాలి. అభివృద్ధి పనుల్లో జాప్యం సహించం" అని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలపై మొదటి విడతలో లబ్ధిదారుల ఎంపికలో ఏ విధంగా నైతే అమలు జరిగి రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుందో అదేవిధంగా రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉండాలని అన్నారు..ఉన్న లబ్ధిదారుల కు సంబంధించిన అన్ని అర్హతలు కలిగిన వారి నివేదికల ఆధారంగా పూర్తి పారదర్శకంగా జరగాలని అన్నారు. మొదటి విడత లబ్ధిదారులకు వేగంగా ఇంటి నెంబర్ కేటాయించాలన్నారు. మైగ్రేన్స్ పనులపై పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాలలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులు అందుకు చర్యలు తీసుకోవాలని, సాంక్షన్ అయిన పనులను త్వరగా పూర్తిచేయాలని, ఇంకా ఇతర పనులపై నివేదికలు ఇవ్వాలని అన్నారు. ప్రతి బుధవారం మండలాలలో జరిగే సమావేశాలకు ఖచ్చితంగా పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొని గ్రామాలలోని అభివృద్ధి పనులపై సమీక్షించాలని అన్నారు.ఈ నెల 18 వ తేదీ నుండి ప్రారంభమయ్యే వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో నర్సరీ ల ద్వారా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే బాగుంటుందని అన్నారు...నాటిన ప్రతి మొక్క బతికి ఉండే విధంగా ఏపుగా ఎదిగే బాధ్యత తీసుకోవాలని అన్నారు. రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని అన్నారు. సన్న,పెద్దకారు రైతులను వారి భూమికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపే విధంగా చూడాలని అన్నారు. మంకీ ఫుడ్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.అంతకుముందు వర్షాకాలంలో దెబ్బతిన్న వాటికి భీమా అందించడం అదేవిధంగా ఇప్పుడు వచ్చే వర్షాకాలంలో తీసుకివాల్సిన జాగ్రత్తలపై వచ్చే వర్షపాతాలకు ప్రిపేర్ అయి ఉండాలని, వర్షాకాలం నేపథ్యంలో ప్రతి మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఏవైతే వర్ష ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రాంతాలు, ఏవైనా ప్రమాదానికి దారి తీసే టువంటి స్థలాలను గుర్తించి నివేదికలను సమర్పించాలని అన్నారు..ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లో ఎటువంటి చర్యలు తీసుకోవాలి...వలంటీర్లను యాక్టివ్ చేసి రెడీగా ఉండాలని ఎక్కువ పట్టణ ప్రాంతాల్లో ముంపు ప్రాంతాలు, పాత ఇండ్లను గుర్తించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు..అంతకుముందు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ అడిషనల్ డిఎంఈ డాక్టర్ శ్రీనివాస్ ప్రధాన ఆస్పత్రి అభివృద్ధిపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి, నాలుగు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదం తీసుకున్నారు, రోగులకు నిరంతర వైద్య సేవలు అందించేందుకు మందులు, సర్జికల్ సామాగ్రి కోసం, అదనపు నిధులు, అత్యవసర నిర్వహణ ఖర్చుల కోసం ఈ తీర్మానాలను ప్రవేశపెట్టారు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వివిధ దశలలో కొనసాగుతున్న అంశంపై హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పురుషోత్తం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు, ఇప్పటికే మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు, గ్రౌండింగ్ పూర్తి అయిన వివరాలను లబ్ధిదారులకు అందిస్తున్నటువంటి నిధుల వివరాలు, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తున్న ఇండ్ల స్థితిగతులను వివరించారు, రాష్ట్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిర్మాణంలో జిల్లా అత్యుత్తమ ఫలితాలు సాధించి పురోగతిలో ఉందని అందుకుగాను ప్రశంసాలు అందుకోవడం జరిగిందని తెలిపారు ,ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ, పురుషోత్తం, మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేశ్వరి, గణేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కేవలం ప్రకాష్ రెడ్డి, అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐ పైన చర్యలు తీసుకోవాలి



విశ్వంభర, ఇబ్రహీంపట్నం : శంషాబాద్ జోన్ డిసిపి మహేష్ గారిని కలిసి ఆదివారం రోజు ఆదిభట్ల పీఎస్ పరిధిలో జరిగిన అక్రమ చర్చి కేసు మరియు ఆ కేసులో అత్యుత్సాహంతో ఒక్క వర్గానికి అనుకూలంగా వ్యవరించిన ఎస్.ఐ నోయెల్ రాజ్ గారి మీద యాక్షన్ తీసుకోవాల్సిందగా డీసీపీ మహేష్ గారికి కంప్లైంట్ చేసిన జీహెచ్ఎంసీ 53,56 డివిజన్ బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహ రెడ్డి. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి నారాయణ యాదవ్, బచ్చిగళ్ళ రమేష్, ఆదిభట్ల మున్సిపాలిటీ అధ్యక్షులు గజ్జల నరసింహ రెడ్డి, గుండా కృష్ణ, సురేష్ నందగిరి, దినేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.